సాక్షి
రంగారెడ్డి
గురువారం । 8 । జూన్ । 2023



ప్రాణం తీస్తున్న పార్టీలు

స్నేహితులతో కలిసి సరదాగా.. విందులు చేసుకుని తిరిగి వెళ్లే క్రమంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 8లో▸



రూ.90 లక్షలతో మెట్లబావి

బన్సీలాల్‌పేటలోని మెట్ల బావి తరహాలో మహేశ్వరం మెట్లబావిని అభివృద్ధి చేస్తామని మంత్రి సబితారెడ్డి అన్నారు. 8లో▸



ఏడాదిలోగా సాగునీరు

వ్యవసాయాన్ని పండుగగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మైసిగండి హుండీ ఆదాయం రూ.15,11,651



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయా దేవస్థానాల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 70 రోజులకు సంబంధించి భక్తులు నగదు రూపంలో రూ.15,11,651 సమర్పించారు. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలీ, నాయకులు, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ముఖ్య అర్చకులు యాదగిరిస్వామి, భోడియానాయక్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి



నాయకులు, అధికారులతో సమావేశమైన ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

చేవెళ్ల: కొత్తగా ఓటు హక్కుకోసం పొందాలనుకునే అభ్యర్థులు ఫామ్ 6 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ వేణుమాధవ్‌రావు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బూత్ లెవెల్ ఆఫీస్‌లతో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటరు లిస్టుపై సర్వే చేయిస్తున్నామని తెలిపారు. తొలగించిన ఓట్లపై మరోసారి విచారణ చేయించి, అర్హులైన వారిని జాబితాలో చేరుస్తామని స్పష్టంచేశారు. మండలాల వారీగా ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నామని, ఇందులో ఏవైనా పొరపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో డీఏఓ మహ్మద్ తౌఫిక్, శంకర్‌పల్లి తహసీల్దార్ నయీమొద్దీన్, చేవెళ్ల నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



యాచారంలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న సీఆర్‌డీ విజిలెన్స్ బృందం

యాచారం: గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించింది. సీఆర్‌డీకి చెందిన ఉమారాణి, ఉష, సీరజ తదితరులు యాచారంలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. ఇక్కడ పెంచుతున్న మొక్కలను పరిశీలించి, వేసవి దృష్ట్యా వారానికి రెండు, మూడు సార్లు నీరు అందించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. సాగర్‌రోడ్డు, చౌదర్‌పల్లి, గునుగల్, ఆగాపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ కార్యాలయంలో రికార్డులు, కూలీల వేతనాలు చెల్లింపు తదితర వివరాలను సేకరించారు. వీరివెంట ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, శివశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉప్పల ట్రస్ట్ ఔదార్యం



మేఘనారెడ్డికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: తండ్రిని కోల్పోయిన విద్యార్థి చదువుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. వీరన్నపల్లికి చెందిన బెక్కరి లక్ష్మారెడ్డి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ ప్రభావం అతని కూతురు మేఘనారెడ్డి పైచదువుల(అమెరికాలో ఎమ్మెస్)కు ఆటంకంగా మారింది. విషయం తెలుసుకున్న ఉప్పల ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్ రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, ఉప సర్పంచ్ కొండల్‌యాదవ్, దామోదర్ తదితరులు ఉన్నారు.



బోనాలతో తరలివస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి బోనాలు

వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ షాబాద్ ప్రజలు గ్రామ దేవతలను వేడుకున్నారు. బుధవారం బోనాలతో తరలివెళ్లి బొడ్రాయికి మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో సర్పంచ్ తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి రవీందర్, వైస్ ఎంపీపీ జడల లక్ష్మీరాజేందర్‌గౌడ్, ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

– షాబాద్



పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ కొనసాగుతున్న బోనాల ర్యాలీ

సిరుల పంట సీఎం ఘనతే

మిగిలింది 'పాలమూరే'..

- యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం
- ధాన్య భాండాగారం తెలంగాణ
- సాగునీటి దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి



మహేశ్వరంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణలో సిరుల పంటలు పండుతున్నాయని, వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య హాల్‌లో బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు త్వరితగతిన పూర్తి చేసి.. సాగునీటితో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును కేవలం నాలుగేళ్లలో పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. ఇదే తరహాలో పాలమూరును పూర్తి చేసి 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. రూ.10 వేల కోట్లతో రాష్ట్రంలోని 27 వేల చెరువులు, కుంటల్లో అభివృద్ధి పనులు చేశారన్నారు. మిషన్ కాకతీయతో చెరువులు, కుంటల్లో జలకళ సంతరించుకుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మత్స్యకారులు, ముదిరాజులకు ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా.. ప్రస్తుతం 3 కోట్ల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని, ఇది పంజాబ్ కన్నా అధికమని వివరించారు. సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని స్పష్టంచేశారు. ఇంద్రారెడ్డి ప్రత్యేక ఉద్యమం చేసినప్పుడు తెలంగాణ అనే పదాన్ని పలికేందుకు కూడా నాయకులు భయపడేవారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతానాయక్, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యులు కూన యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు, ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ హైదర్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నర్సింహులు, డీఈ దుదియా నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ మహమూద్‌అలీ, ఎంపీడీఓ నర్సింహ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాగులో సంచలనం

- కేసీఆర్ విజన్‌తోనే సాధ్యమైంది
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



చేవెళ్లలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ వల్లే తెలంగాణ రాష్ట్రం దేశంలో నంబర్ వన్‌గా నిలిచిందని ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం చేవెళ్లలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. వేడుకలకు ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన ప్రగతి, చేపట్టిన కార్యక్రమాలపై వీడియోను ప్రదర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సాగునీటి రంగంలో సంచలనం సృష్టించామని తెలిపారు. ప్రాజెక్టుల రీ డిజైన్‌తో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 19లక్షల ఎకరాల సాగు పెంచారని గుర్తు చేశారు. ఒకప్పుడు ఆకలి కేకలతో అలమటించిన తెలంగాణ.. నేడు దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇది కేసీఆర్ దూరదృష్టి, పట్టుదల, కృషితోనే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో రైతు కంట నీరు వస్తే నేడు పొలంలో సాగునీరు పారుతోందని తెలిపారు. బీడు నేలలను కాళేశ్వరం జలాలతో తడిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రంగారెడ్డి, ఈఈ రేణుకాదేవి, డీఈఈ వెంకటరమణ, పరమేశ్వర్, ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, నీటిపారుదల శాఖ ఏఈలు లక్ష్మి, రాధిక, గోపీనాథ్, సురేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నర్సింహులు, లింగం, పండరి, ఐకేపీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈజీ మనీ.. కల్తీ పని!

- వ్యక్తి అరెస్ట్.. రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కల్తీ నూనెలు తయారు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదిబట్ల ఎస్ఐ లక్ష్మీనారాయణ వివరాల ప్రకారం.. కుర్మల్‌గూడలో సాంబ నరసింహ అనే వ్యక్తి.. ఇంట్లో కల్తీ నూనెలు తయారు చేస్తున్నాడనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ నూనె

15 లీటర్ల సామర్థ్యం కలిగిన 87 వనస్పతి డాల్డా డబ్బాలు, 110 ఆయిల్ టిన్లు, 15 డబ్బాల కల్తీ నెయ్యి, 10 కిలోల నెయ్యి ముద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నర్సింహను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

గ్రూప్– 1కు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రూప్–1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 11న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 55,032 మంది అభ్యర్థులు హాజరవుతారని స్పష్టం చేశారు. ఇందుకోసం 131 సెంటర్లను ఎంపిక చేశామన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 81, సైబరాబాద్ పరిధిలో 50 కేంద్రాలు ఉంటాయని తెలిపారు. దివ్యాంగుల కోసం 54 మంది స్క్రైబ్‌లను సిద్ధంగా ఉంచామన్నారు.

సీసీ కెమెరాల నిఘా

పరీక్షలు సజావుగా జరిగేందుకు సెంటర్లలోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పని చేయని కెమెరాలను ముందుగానే గుర్తించి, సరిచేయాలన్నారు. అభ్యర్థులకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. పరీక్ష సమయంలో కరెంట్ కోతలకు ఆస్కారం లేకుండా చూడాలని డిస్కం ఇంజనీర్లను ఆదేశించారు. సెంటర్ల వద్ద పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు తెలిపారు. స్టాఫ్ నర్సుతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు.


ఇద్దరు చొప్పున ఇన్విజిలేటర్లు

ప్రతీ 48 మంది అభ్యర్థులకు ఇద్దరు చొప్పున ఇన్విజిలేటర్లను నియమించాలని కలెక్టర్ తెలిపారు. వీ రికి ముందుగానే శిక్షణ ఇవ్వాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు 'నో రిలేషన్ సర్టిఫికె ట్' ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు టెన్షన్ పడకుండా.. ఉదయం 8:30 నుంచే సెంటర్‌లోనికి అనుమతించాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, రైటింగ్ ప్యాడ్, షూస్‌కు అనుమతి లేదని స్పష్టంచేశారు. హాల్ టికెట్లతో పాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను వెంట తెచ్చుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

సైబరాబాద్‌లో టీటీపీ

- గచ్చిబౌలిలో 2.5 ఎకరాల భూ కేటాయింపు
- సిబ్బంది శిక్షణ కోసం ప్రత్యేక స్థలం
- ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన
- రోడ్డు భద్రతపై పరిశోధన కోసం లేబొరేటరీ

సాక్షి, సిటీబ్యూరో: జనసాంద్రత, ప్రాంతాలవారీగా దేశంలోనే అతిపెద్ద పోలీసు కమిషనరేట్లలో సైబరాబాద్ ఒకటి. ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలకు కేంద్ర బిందువైన సైబరాబాద్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోంది. ప్రతి రోజు సుమారు 5–6 లక్షల వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సవాల్‌గా మారింది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేమి ప్రమాదాలకు ప్రధాన కారణమని పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించడమే ప్రధాన ఆయుధమని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు భావించారు. ఈమేరకు ట్రాఫిక్ శిక్షణ అకాడమీ (టీటీపీ)ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు.



టీటీపీ రూపమిలా..

టీటీపీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ రోడ్డులో 2.5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. బీ+జీ+1 అంతస్తులో 89 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం ఉంటుంది. ఇందులో రిసెప్షన్, లేబొరేటరీ, ఆఫీసు, గెస్ట్ రూమ్స్, యాంపి థియేటర్, కెఫెటేరియా, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ పార్క్, వాకింగ్ ట్రాక్స్ వంటివి ఉంటాయి. హరిత భవన ప్రమాణాల ప్రకారమే టీటీపీ నిర్మాణం ఉంటుంది. సుమారు రూ.5 కోట్ల నిర్మాణ వ్యయాన్ని అంచనా వేయగా.. ఇప్పటికే రూ.2 కోట్లు విడుదలయ్యాయని సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ నిధుల సమీకరణ కోసం ప్రయత్నిస్తుందని ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి ఒకరు తెలిపారు.

ప్రధాన లక్ష్యాలివీ..

- ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన.
- రహదారి భద్రతపై కొత్త ఆవిష్కరణలు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి విద్యా సంస్థలతో పరిశోధనలు.
- విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ పార్క్. డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్ కేంద్రం.

ఆ టేస్టే వేరు



- జల్‌పల్లి చెరువుకు మృగశిర శోభ
- హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్న చేపలు
- తాజాదనం, రుచికి పెట్టింది పేరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువుకు మృగశిర శోభ నెలకొంది. పుష్కలమైన నీటితో నిండుకుండలా ఉన్న చెరువు వద్ద తాజా చేపలు కొనుగోలు చేసేందుకు మత్స్య ప్రియులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీ కావడంతో.. హాట్‌కేకుల్లా అమ్ముడు పోతున్నాయి. గురువారం మృగశిర కార్తెను పురస్కరించుకొని బుధవారం ఉదయం చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేసి చేపల వేట ప్రారంభించారు. 150 ఎకరాల విస్తీర్ణంలోని చెరువులో ఆరోగ్యవంతమైన, రుచికరమైన చేపలు లభిస్తాయనే నమ్మకంతో పాతబస్తీ, కాటేదాన్, శంషాబాద్ తదితర ప్రాంతాల పెద్ద ఎత్తున తరలివస్తారు. పాంప్లెట్స్ రకం కిలో రూ.100 ఉండగా.. సాధారణ చేపలు కిలో రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు.

రెండు సంఘాల ఆధ్వర్యంలో.

జల్‌పల్లి శ్రీరామ ఫిష్ సొసైటీ, పాతబస్తీ కందికల్ గేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రెండు గ్రూపులు ఈ చెరువులో చేపలను పెంచి విక్రయిస్తుంటారు. గతేడాది కురిసిన భారీ వర్షాలతో నిండుకుండలా మారిన చెరువులో ఏపీలోని కూచిపూడి నుంచి చేప పిల్లలు తీసుకొచ్చి వదిలారు. వీటిలో రవ్వు, బొచ్చ, కట్ల, గ్యాస్కిట్, కొర్రమీను తదితర రకాలున్నాయి. మృగశిర సందర్భంగా బుధ, గురు, శుక్ర వారాల్లో మూడు రోజుల పాటు చేపలు పడుతున్నప్పటికీ.. సాధారణ రోజుల్లో ప్రతీ శని, ఆది వారాల్లో పడుతారు. ఇలా చెరువు నుంచి ప్రతీ వారం దాదాపు 15 క్వింటాళ్ల చేపలను పట్టి విక్రయిస్తారు. ఒక్కో చేప కిలో నుంచి ఐదారు కిలోల వరకు తూకం పెరగడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జల్‌పల్లి చెరువు వద్ద కొనుగోలుదారుల సందడి

కాకతీయతోనే కళ

మిషన్ కాకతీయ పథకం కింద 2016లో ప్రభుత్వం రూ.46.70 లక్షలు కేటాయించి చెరువు అభివృద్ధి పనులు చేపట్టింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో దాదాపు 40 ఏళ్ల తర్వాత చెరువు అలుగు పారింది. ప్రభుత్వం తరఫున ఏటా చేపపిల్లలు పంపిణీ చేస్తున్నారు.

అంతా కలిపి ఫిష్ సొసైటీ



కులమతాలకు అతీతంగా ఫిష్ సొసైటీ ఏర్పాటు చేసుకొని చేపలు పెంచుతున్నాం. మృగశిర సందర్భంగా చెరువుకు పూజలు చేసి చేపలు పట్టాం.

– మహేందర్, శ్రీరామ ఫిష్ సొసైటీ అధ్యక్షుడు

ఎంతో రుచికరం



జల్‌పల్లి చెరువు చేపలు రుచికరంగా ఉంటాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ కొనుగోలు చేస్తారు. తాజా చేపలు అప్పుడే పట్టి ఇస్తారు.

– దూడల శ్రీనివాస్ గౌడ్, జల్‌పల్లి

క్లుప్తంగా

బావమరిదికి వీడ్కోలు చెప్పేందుకు వెళ్తూ..

నవ వరుడు దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: సోదరి వివాహం కోసం విదేశాల నుంచి వచ్చిన తన బావమరిదికి వీడ్కోలు పలికేందుకు వెళ్తుండగా జరిగిన కారు ప్రమాదంలో నవ వరుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. బోడుప్పల్‌లోని కేశవనగర్ కాలనీ ఎస్వీ బృందావన్‌లో నివసించే ప్రైవేట్ లెక్చరర్లు మురళీధర్, సుచరిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు చిరు హర్షిద్(26) సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నాడు. మే 10న జరిగిన హర్షిద్ వివాహానికి విదేశాల నుంచి బావమరిది వచ్చాడు. తిరుగు ప్రయాణం నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా రాత్రి 7.30గంటల ప్రాంతంలో రావిర్యాల వద్ద ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్పృహ తప్పిన హర్షిద్ (26)ను నగరంలోని అమ్మ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. హర్షిద్ బావమరిదికి స్వల్ప గాయలయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వంహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాణం తీసిన అతివేగం

మంచాల: అతి వేగం ఓ యువకుడి ప్రాణం తీయగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సత్యం తండాకు చెందిన రమావత్ సచిన్ (19) పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని అదే బంక్‌లో పని చేస్తున్న ఎల్లపల్లి తండా, సాయిబండ తండాకు చెందిన మరో ఇద్దరు యువకులతో కలిసి సత్యం తండాకు వెళ్తున్నారు. అతివేగంతో వెళ్తున్న వీరి బైక్ లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో సచిన్ అక్కడికక్కడే మృతి మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామన్ గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించగా తండా వాసులు ప్రమాదకారకులను గుర్తించే వరకు తరలించేది లేదని భీష్మించుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాణం తీస్తున్న పార్టీలు

ప్రమాదాలు యువత తల్లిదండ్రుల్లో అలజడి పుట్టిస్తున్నాయి. స్నేహితులతో సరదాగా గడుపుదామని విందులకు వెళుతూ ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు తరుచుగా చోటుచేసుకుంటున్నాయి. దీంతో వారి తల్లిదండ్రులు క్షోభిస్తున్నారు. ఇలాంటి సంఘటనలకు వారి పర్యవేక్షణ లోపం కొంత కారణమవుతోంది. మరికొందరు యువకులు బైక్‌లపై అతివేగంతో దూసుకుపోతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

- ప్రమాదాల బారిన పడుతున్న యువత
- విషాదం మిగులుస్తున్న ఫాం హౌస్ సరదాలు
- హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వరుస ఘటనలు



తాజ్ హోటల్ వద్ద లారీని ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)



రాణే ఇంజన్‌వాల్స్ వద్ద చెట్టును ఢీకొట్టిన బైక్ (ఫైల్)

మొయినాబాద్: స్నేహితులతో కలిసి సరదాగా గడపాలని.. విందులు చేసుకుని ఉత్సాహంతో ఉండాలని ప్రతీ ఒక్కరు కోరుకుంటారు. యువత అనుకున్నదే తడువు ఏర్పాట్లు చేసేస్తుంటారు. అలాంటి విందులు, వినోదాలకు ఫాంహౌస్‌లను ఎంపిక చేసుకుని బయలుదేరుతున్నారు. స్నేహితులతో కలిసి ఆనందంతో గడిపినవారు అంతలోనే ప్రమాదాల బారిన పడి కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నారు. ఇటీవల మొయినాబాద్‌లో ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి.

ఓఆర్ఆర్‌కు చేరువలో..

హైదరాబాద్ మహానగరానికి మొయినాబాద్ మండలం అతిచేరువలో ఉంది. మండల పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డు పక్కనే ఫాంహౌస్‌లు అనేకం ఉన్నాయి. నగరం నుంచి సెలవు రోజులు, వారాంతాల్లో ఇక్కడి ఫాంహౌస్‌లకు వచ్చి సరదాగా గడుపుతుంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండటంతో నిత్యం వందలాది మంది ఫాంహౌస్‌లకు వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అయితే ఫాంహౌస్‌లకు వెళ్లే టప్పుడు.. ఫాంహౌస్‌లో ఎంజాయ్ చేసి తిరిగి నగరానికి వెళ్లేటప్పుడు కొంత మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలో కోల్పోయి వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతుండగా మరి కొందరు గాయాలపాలై ఇబ్బందులు పడుతున్నారు.

వరుస ప్రమాదాలు

ఫాంహౌస్‌లు విందులు, వినోదాలు, పార్టీలతో సరదాగా గడిపేందుకు వచ్చినవారు ఇటీవల వరుసగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పదిహేను రోజుల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందగా.. ఐదుగురు గాయాలపాలయ్యారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయి. ఏడాది క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువతీ, యువకుడు నగరంలో కారు అద్దెకు తీసుకుని వికారాబాద్ జిల్లా అనంతగిరికి వెళ్లారు. అక్కడ హరిత రిసార్ట్స్‌లో రోజంతా సరదాగా గడిపి రాత్రి నగరానికి వెళ్తుండగా మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా వద్ద కారు అతివేగంతో వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి కుడివైపు రోడ్డులోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. రెండేళ్ల క్రితం నగరానికి చెందిన ఏడుగురు యువతీ, యువకులు కారులో వికారాబాద్‌లో ఫాంహౌస్‌కు వెళ్తుండగా కనకమామిడి గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువతులు మృతి చెందారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మే 22న రాత్రి నగరంలోని యూసుఫ్‌గూడకు చెందిన ఇద్దరు యువకులు ఓ ఫాంహౌస్‌కు వచ్చారు. రాత్రంతా సరదాగా గడిపారు. 23న ఉదయం బైక్‌పై నగరానికి వెళ్తూ మండల పరిధిలోని రాణే ఇంజన్‌వాల్స్ కంపెనీ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. తాజాగా సోమవారం రాత్రి మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి శివారుల్లో ఉన్న ఓ ఫాంహౌస్‌కు నగరంలోని కార్వాన్, మిర్ఆలమ్ మండి ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు కారులో వచ్చారు. రాత్రి ఫాంహౌస్‌లో పార్టీ చేసుకుని ఎంజాయ్ చేశారు. ఉదయం తిరుగు ప్రయాణంలో తాజ్‌హోటల్ వద్ద రాంగ్‌రూట్లో అతివేగంతో వెళ్లి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జైంది. ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు.

అసలే ఇరుకు.. అందులో మలుపులు

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రమాదాలకు కారణం ఇరుకైన రోడ్డు.. ఎక్కువగా ఉన్న మూలమలుపులే. దీనికి తోడు వాహనాలను అతివేగంతో నడపడం. ఈ రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపులు పదికి పైగా ఉన్నాయి. మొయినాబాద్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు రెండు లైన్లు మాత్రమే ఉండటంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి విస్తరణకు నిధులు మంజూరు కావడంతో బైపాస్‌ల వద్ద పనులు మొదలయ్యాయి. అయితే ప్రధాన రహదారికి ఇరుపక్కల ఉన్న మర్రి చెట్ల తొలగింపుపై గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు కొనసాగుతుండడంతో రోడ్డు విస్తరణ పనులు జరగడంలేదు.

వేగ నియంత్రణకు చర్యలు



హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి ఇరుకుగా ఉండటంతోపాటు వాహనదారులు అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో కలిసి రహదారిపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి భారీకేడ్లు ఏర్పాటు చేయిస్తాం. వేగ నియంత్రణకు తగిన చర్యలు చేపడుతాము.

– దీకే లక్ష్మీరెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

రూ.90 లక్షలతో కోనేరు మెట్లబావి

- మంత్రి సబితారెడ్డి వెల్లడి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మహేశ్వరం: బన్సీలాల్‌పేటలో ఉన్న మెట్ల బావి తరహాలో మహేశ్వరం మెట్ల బావిని అభివృద్ధి చేస్తామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు.. బుధవారం మండల కేంద్రంలో రూ.90 లక్షల నిధులతో పురాతన కోనేరు మెట్ల బావి పునరుద్ధరీకరణ పనులకు ఎమ్మెల్సీతో కలసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాకతీయుల చరిత్ర ఉట్టి పడేలా మహేశ్వరంలో పురాతన కోనేరు మెట్ల బావిని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పురాతన కట్టడాల పరిరక్షణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహేశ్వరాన్ని పర్యాటక కేంద్రంగా మార్చే క్రమంలో చరిత్ర కలిగిన ఆలయాలను ఆనాటి కట్టడాలను, కాకతీయుల కళావైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా అభివృద్ధి చేస్తామన్నారు. మహేశ్వరంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయం, గడికోట, కోనేరు మెట్ల బావి, జెన్నాయిగూడ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, శ్రీనగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఇంద్రారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మహేశ్వరం కొత్వాల్ చెర్వు కట్టపైన 40 అడుగల భారీ శివుడి విగ్రహం, బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చులో సింహభాగం ట్రస్టు భరిస్తుందని మంత్రి వివరించారు. కాగా, మండలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 65 మంది లబ్ధిదారులకు చెక్కులను మంత్రి సబిత అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, కందుకూరు జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ మహమూద్‌అలీ, డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్ఐలు పావని, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

మహేశ్వరం: ముదిరాజ్ కులస్తుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో నిర్మించే ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు మంత్రి రూ.10లక్షల నిధులను మంజూరు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులు అన్నిరంగాల్లో ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మంత్రికి జ్ఞాపిక అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయప్ప, ఉప సర్పంచ్ నర్సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవరం గౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, బ్యాగరి రాజు, జగదీష్ ముదిరాజ్, మచ్చేందర్ గౌడ్, యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరు మెట్లబావి పునరుద్ధరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

షోరూంలోని కార్‌తో ఉద్యోగి పరార్

శంషాబాద్: ఓ కార్‌షోరూంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కారుతో పరారయ్యాడు.ఈ ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ పట్టణంలోని కిషన్‌గూడ వద్ద ఉన్న నెక్సా కార్ షోరూంలో నగరానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ సూఫీ ఎవ్వాల్యుయేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తాజాగా షోరూంలోని ఓ కారును తానే కొనుగోలుదారుడిగా బుక్‌చేశాడు అంతేకాకుండా టెస్ట్‌డ్రైవ్ పేరిట కారును తీసుకుని వెళ్లాడు. అటు వినియోగదారులతో మాట్లాడకపోవడంతో పాటు షో రూంకు తిరిగి రాకపోవడంతో పరారైనట్లు గుర్తించారు. దీంతో షోరూం మేనేజర్ ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలోగా సాగునీరు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హామీ
- వ్యవసాయాన్ని పండుగలా మార్చిన సీఎం కేసీఆర్
- ఇబ్రహీంపట్నంలో ఘనంగా సాగునీటి దినోత్సవం



సాగునీటి రంగంలో ప్రగతి ప్రవాహం పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: వ్యవసాయాన్ని పండుగగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఏడాదిలోగా నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నంలో సాగునీటి దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. కేసీఆర్ రైతురాజ్యంలో పుట్ల కొద్ది పంట దిగుబడి అవుతోందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసమైన చెరువులను మిషన్ కాకతీయ కింద బాగు చేశామని, దీంతో ఎక్కడ చూసినా జలకళ సంతరించుకుందని, భూగర్భ జలాలు బాగా పెరిగాయని ఎమ్మెల్యే వివరించారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు ప్రధాన ఆధారమైన పెద్దవాగును రూ.15.34 కోట్లతో ఆధునికీకరించామని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద 5వ జలాశమైన ఉద్దండపూర్ రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అక్కడి నుంచి 105 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఎడమ కాలువ ద్వారా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని 54 వేల ఎకరాలకు సాగు నీరు వస్తుందని తెలిపారు. శివన్నగూడ ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ తూర్పు ప్రాంతానికి మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు చెప్పారు. 120 చెరువులు నింపి 84 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నట్లు చెప్పారు. సాగునీటి రంగంలో ప్రగతి ప్రవాహం అనే అంశంపై ప్రభుత్వం ముద్రించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే అవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నోడల్ అధికారిని సునీత, ఎంపీపీ కృపేష్, ఇరిగేషన్ డీఈ ఉషారాణి, జెడ్పీటీసీ జంగమ్మ, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.రాంరెడ్డి, తహసీల్దార్లు అనిత, అనితారెడ్డి, సుచరిత, ఎంపీడీఓలు క్రాంతికిరణ్ మమతబాయి, శ్రీనివాస్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



శంకర్‌పల్లి: వడదెబ్బ తగిలి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న దండు రాజేశ్వర్ బట్టల షాపు ఎదుట గుర్తు తెలియని వ్యక్తి (40–46) పడిపోయి ఉన్నాడు. అతడు మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఒంటిపై ఇండియన్ టీ షర్టు, నలుపురంగు తెల్లటి చారల నిక్కరు ఉంది. ఎండ వేడికి తట్టుకోలేకే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓఆర్ఆర్‌పై ప్రమాదం.. లారీ డ్రైవర్ మృతి

ఘట్‌కేసర్: టైర్ల లోడుతో వెళుతున్న ఓ లారీ ఓఆర్ఆర్‌పై నిలిపిన మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట ఎంఆర్ఎఫ్ కంపెనీకి చెందిన లారీ టైర్ల లోడుతో రాంచీకి రాత్రికి బయలు దేరింది. బుధవారం వేకువ జామున 3 గంటల ప్రాంతలో మైల్ స్టోన్ 82 వద్ద అంబర్‌పేట్ వెళ్లే మార్గంలో ఎటువంటి హెచ్చరికలు, పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా ఆగి ఉన్న వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో క్యాబిన్‌లో ఇరుక్కున్న మధ్యప్రదేశకు చెందిన డ్రైవర్ మనోజ్ పరిహార్ (43) మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేను ఇంకా చదువుకుంటా.. పెళ్లి వద్దు..

ఉత్తరం రాసి అదృశ్యమైన విద్యార్థిని

శంషాబాద్: 'నేను ఇంకా చదువుకుంటాను... నాకు ఇప్పుడే పెళ్లి వద్దు' అంటూ ఉత్తరం రాసి ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలో ఖాజీగల్లి బస్తీలో నివాసముండే రజీయా బేగం కుమార్తె రుబీనా బేగం (19) బుధవారం మధ్యాహ్నం ఉత్తరం రాసి ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. ఇప్పుడే పెళ్లి చేసుకోను.. చదువకుంటాను అందుకే వెళ్లిపోతున్నాను అని అందులో రాసి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేప ప్రసాదానికి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లు, మహాత్మా గాంధీ, జూబ్లీబస్ స్టేష న్లు, శంషాబాద్ ఎయిర్ పోర్ట్ తదితర ప్రాంతాల నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఉప్పల్, ఈసీఐఎల్, మెహిదీపట్నం, కూకట్ పల్లి, బొల్లారం, బీహెచ్‌ఈఎల్, పటాన్ చెరు తదితర అన్ని ప్రాంతాల నుంచి బస్సులను నడుపుతారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వాళ్లంతా తిరిగి వెళ్లే వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. బస్సులపై ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ స్పెషల్ అనే డెస్టినేషన్ బోర్డులను ఏర్పాటు చేస్తారు.

మేకల మందపై కుక్కల దాడి

20 జీవాలు మృత్యువాత

కందుకూరు: వీధి కుక్కల దాడిలో 20 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని గఫూర్‌నగర్‌లో ఈర్లపల్లి ప్రభాకర్‌కు చెందిన మేకల మందపై మంగళవారం రాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో మేకలు మృత్యువాత పడడంతో బాధితుడు ప్రభుత్వమే ఆదుకోవాలంటూ బోరున విలపించాడు. కాగా బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఘటనా స్థలిని పరిశీలించి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. వీధి కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ వసంతకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

పిడుగు పాటుకు గేదెలు మృతి

షాద్‌నగర్: పిడుగుపాటుకు గురై రెండు గేదెలు మృతి చెందిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీగా వర్షం కురిసింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన రైతు బుడ్డయ్య తనకున్న గేదెలను వ్యవసాయ పొలంలోని చెట్టు వద్ద కట్టేశాడు. ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రుక్సానా బేగం ఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు. రైతును ఆదుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.